

దుర్గమ్మకు వెండి దిమ్మల కానుక

ఇంద్రకీలాద్రి (విజయవాడ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు కె.శ్రీకాంత్ కుటుంబం (తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం) గురువారం 3.495 కిలోల వెండి దిమ్మలు సమర్పించారు.



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి గంధం మాధవి (రావులపాలెం మండలం దేవరపల్లి) గురువారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

10,450 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 10,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.05 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

22న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలి

కపిలేశ్వరపురం: అయోధ్యలో రామాలయంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నేపథ్యంలో రాష్ట్రంలోని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ రామ జన్మభూమిలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం భారతజాతి ఔన్నత్యాన్ని చాటిచెప్పేరోజు అని అన్నారు.

రూ.86 లక్షలతో రోడ్డు నిర్మాణం



అభివృద్ధి చేసిన రోడ్డు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం బీఈడీ కళాశాల నుంచి అయినవిల్లి సొసైటీ వరకూ రూ.86 లక్షలతో రోడ్డును నిర్మించారు. దీన్ని సుమారు 1.60 కిలోమీటర్ల మేర నిర్మించారు. అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి వచ్చే భక్తులు, వాహనాల వల్ల ముక్తేశ్వరం నుంచి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంకు వెళ్లే రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఒక్కోసారి ట్రాఫిక్ జాం అవుతోంది. దీన్ని గుర్తించిన అధికారులు ఈ రోడ్డుకు అనుసంధానంగా ముక్తేశ్వరం బీఈడీ కళాశాల నుంచి అయినవిల్లి సొసైటీ వరకూ చేరుకునే రోడ్డును అభివృద్ధి చేశారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులకు, రవాణాకు ఇబ్బంది తలెత్తకుండా ఈ రోడ్డు ఉపయుక్తంగా ఉంది. దీంతో పంచాయతీరాజ్ అధికారులకు ఈ ప్రాంత వాసులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

తెలుగు సాహిత్య వెలుగు రేఖ యోగి వేమన

అంబాజీపేట: అందరికీ అర్థమయ్యే రీతిలో పద్యాలు చెప్పి ప్రజలను మెప్పించిన యోగి వేమన తెలుగు సాహిత్య వెలుగు రేఖ అని పి.గన్నవరం ఇంటిలిజెన్స్ ఏఎస్సై ఇళ్ల ఏడుకొండలు, అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల ఆర్థికశాఖాచార్యులు బాదం సుధాకరరెడ్డి, స్థానిక కళాశాల కరస్పాండెంట్ మట్టపర్తి సాయిప్రసాద్, గ్రేస్ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడు సీఎస్ మూర్తి అభివర్ణించారు. అంబాజీపేట పౌరవేదిక నిర్వాహకుల ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎం జూనియర్ కళాశాలలో యోగి వేమన 657వ జయంత్యుత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాధామణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు యోగి వేమనపై వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వక్తృత్వంలో పి.సరిత, ఆర్.సత్యశ్రీ, యూ.సరిత, వ్యాసరచనలో ఎస్.రమేష్, సీహెచ్.భాను, టి.సమిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, వ్యాసరచనలో స్పెషల్ ప్రైజ్ డి.సాయిదుర్గ సాధించారు.

స్మృతివనానికి ఐదు ప్రత్యేక బస్సులు

అయినవిల్లి: స్మృతి వనం ప్రారంభోత్సవానికి విజయవాడ తరలివెళ్లేందుకు అయినవిల్లి మండలం నుంచి ఐదు బస్సులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వెళ్లే వారు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు బస్సుల వద్దకు చేరుకోవాలన్నారు.

జోరు తగ్గిన కోడి

- సంప్రదాయ క్రీడలకు అగ్రాసనం
- జూదాలకు ఝలక్
- అశ్లీల నృత్యాల కట్టడి
- గత ఏడాది రూ.50 కోట్లు గెలిచిన పందెం కోడి
- ఈ పండగకు రూ.25 కోట్లకు పరిమితం
- ముగిసిన సంక్రాంతి సందడి



ఐ.పోలవరం మండలం కొమరగిరిలో సంక్రాంతి కోడి పందేల బరి వద్ద పలుచగా ఉన్న జనం

సాక్షిప్రతినిధి, కాకినాడ: సంక్రాంతి పేరు చెబితే గోదావరి తీరాన వినిపించే తొలి మాట కోడిపందేలు.. ఆ తర్వాత గుండాటలు..రికార్డింగ్ డ్యాన్సులు.ఫ్లడ్‌లైట్ల వెలుతురు..భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు... రణగొణ ధ్వనులతో కూడిన మైకులు... మొత్తంగా సంక్రాంతి మూడు రోజులు కరెన్సీ కట్టలు తెగే పరిస్థితి. కారణాలేమైతేనేమి రూ.కోట్లు కురిపించే పందెం కోడి జోరు ఈ సంక్రాంతి సీజన్‌లో తగ్గింది. కత్తికట్టి బరిలోకి దింపే కోడి పందేలకు ఈసారి ప్రజలు కాస్త దూరంగా జరిగారు. కత్తికట్టి సాగే కోడి పందేలకు భిన్నంగా జనం సంస్కృతి, సంప్రదాయాలకు అగ్రాసనం వేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పండగ మూడు రోజులు గడిపేందుకు రాష్ట్రం నుంచే కాకుండా రాష్ట్రం వెలుపల నుంచి కూడా పెద్ద ఎత్తున కుటుంబాలకు కుటుంబాలే తరలివచ్చాయి. గతంలో కోడి పందేలు తిలకించేందుకు కాయ్ రాజా కాయ్ అంటూ పందేలు కాసేందుకు గోదావరి జిల్లా వాసులు ఎక్కువగా ఆసక్తి చూపేవారు. ఒకే బరిలో రూ.లక్ష నుంచి రూ.25 లక్షలు కూడా పందెం కాసేవారు. అటువంటిది ఈ పండగ సీజన్‌లో మూడు జిల్లాల్లో కలిపి ఒక మోస్తరుగా వేసిన పెద్ద పెద్ద బరులు ఏడెనిమిది చోట్ల మాత్రమే కనిపించాయి. కాకినాడ జిల్లాలో వేట్లపాలెం, తిమ్మాపురం, గోకవరం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం, మల్కిపురం, కొత్తపేట, రాజోలు మండలాలు, కాట్రేనికోన మండలం గెద్దనాపల్లిలో ఒక మోస్తరుగా పెద్ద బరులు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారు. కోడిపందేలతో పాటు జరిగే గుండాటను మాత్రం దాదాపు పోలీసులు కట్టడి చేశారనే చెప్పొచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతటా కలిపి చూస్తే 60 నుంచి 70 చోట్ల మాత్రమే కోడిపందేలు నిర్వహించారని పోలీసులు ఒక అంచనాకు వచ్చారు.

ఫలితమిచ్చిన పోలీసు చర్యలు

గతేడాది సంక్రాంతి మూడు రోజులు 150 నుంచి 180 వరకు బరులు ఏర్పాటు చేశారు. అప్పట్లో ఉమ్మడి తూర్పుగోదావరి అంతటా కలిపి పందెం కోడి రూ.50 కోట్లు పలికింది. గుండాటల విషయంలో కూడా పోలీసులు చూసీచూడనట్టుగా వ్యవహరించారు. పలు ప్రాంతాల్లో పోలీసుల కళ్లుగప్పి రికార్డింగ్ డ్యాన్సులు కూడా నిర్వహించారు. ఈ సారి సంక్రాంతికి వీటన్నింటిని పోలీసులు నియంత్రించారనే కంటే ప్రజలే స్వచ్ఛందంగా కాస్త దూరంగా ఉన్నారని చెప్పొచ్చు. కత్తికట్టిన కోడి పందేలు కంటే ఈ సంక్రాంతిలో పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా సంప్రదాయంగా సాగే కోడి పందేలను జనం ఆదరించడం ఎక్కువగా కనిపించింది. ప్రజల్లో వచ్చిన మార్పు కావచ్చు, సంక్రాంతికి మూడు వారాలు ముందు నుంచి పోలీసులు తీసుకున్న నియంత్రణా చర్యలు కావచ్చు మంచి ఫలితాన్నిచ్చాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రికార్డింగ్ డ్యాన్సులకు పెద్దాపురం, పిఠాపురం, రాజోలు, కొత్తపేట, మండపేట, జగ్గంపేట తదితర నియోజకవర్గాలలో పలు ప్రాంతాలు పెట్టింది పేరు. కోడి పందేలతో పాటు గుండాటలకు అనుమతిస్తే అనధికారికంగా రికార్డింగ్ డ్యాన్సులు కూడా కానిచ్చేసే వారు. ఒక్కచోట కూడా రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించిన దాఖలాలు లేకపోవడం ఈ సారి పండుగ సీజన్‌లో విశేషం.

ఈ సారి పండుగ మూడు రోజులు ప్రజలు ఎక్కువగా కుటుంబ సమేతంగా పల్లెల్లో కర్రా బిళ్లా, ఖోఖో, మ్యూజికల్ చైర్, అష్టా, చమ్మా వంటి సంప్రదాయ క్రీడల వైపు మొగ్గు చూపారు. ఇందుకు తోడుగా యువత ఎక్కువగా ఆట, పాటలతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఉత్సాహంగా గడిపారు. పెద్దలు, వయసు మీదపడ్డ వారు అయితే నాలుగైదు తరాలు ఒకచోట కలిసి గత జ్ఞాపకాలను నెమరువేసుకుని సహపంక్తి భోజనాలు చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి సంబరాల్లో మునిగి తేలడం విశేషంగా నిలిచింది.

బస్సులు, రైళ్లలో రద్దీ

దూర ప్రాంతాల నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు వచ్చి సంక్రాంతి పండగ సీజన్ మూడు రోజులు సంబరాల్లో మునిగితేలిన బంధుగణం తిరుగుపయనమవుతున్నారు. మంగళవారం కనుమ కావడంతో బంధువులు బుధ, గురువారాల్లో తిరుగు ప్రయాణంలో ఉన్నారు. పుట్టింటి ఆడపడుచులు బుధవారం ముక్కనుమ అని తిరుగు ప్రయాణాన్ని గురువారానికి వాయిదా వేసుకున్నారు. స్తోమతను బట్టి ఆడపడుచులకు తల్లిదండ్రులు, సోదరులు చీర, మిఠాయిలు పెడుతున్నారు. కొత్త అల్లుళ్లకు మాత్రం అత్తమామలు బంగారం, మోటార్ సైకిళ్లు, కార్లు వంటి కానుకలు ఇచ్చి సాదరంగా పంపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు కంపెనీల సెలవులు కూడా అయిపోవడంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాలకు ఒకేసారి బయలుదేరారు. ఫలితంగా కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, తుని, రామచంద్రపురం వంటి ఆర్టీసీ డిపోలు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఆర్టీసీ బస్సులతో పాటు రాజమహేంద్రవరం, కాకినాడ, సామర్లకోట, ద్వారపూడి రైల్వే స్టేషన్‌లు రద్దీగా కనిపిస్తున్నాయి.



రాజమహేంద్రవరం బస్టాండ్‌లో తిరుగు ప్రయాణం కోసం వేచి ఉన్న ప్రయాణికులు



డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సంక్రాంతి సందర్భంగా పచ్చని పొలాల మధ్య ఆనందంగా గడుపుతున్న కుటుంబం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ సంక్రాంతికి నమోదైన కేసులు

9(2) ఏపీ గేమింగ్ యాక్ట్‌లో నమోదైన కేసులు

కోడిపందేలు	345
స్వాధీనం చేసుకున్న కోడికత్తులు	811
కోడిపందేలు ఆడుతూ పట్టుబడ్డవారు	398
నమోదైన కేసుల సంఖ్య	347
సీజ్ చేసిన నగదు మొత్తం	రూ.10,00,476

9(1) ఏపీ గేమింగ్ యాక్ట్‌లో కేసుల వివరాలు

కేసులు	2024లో
జూదాలు, గుండాటలో పట్టుబడ్డవారు	513
నమోదైన కేసులు	736
సీజ్ చేసిన నగదు మొత్తం	రూ.2,70,300
బైండోవర్ కేసులు	2,026

స్త్రీనిధి అవకతవకలపై విచారణ

ఎంపీ సుభాష్‌చంద్రబోస్ ఆదేశం

రామచంద్రపురం రూరల్: మండల పరిధిలో డ్వాక్రా మహిళలకు అందించే స్త్రీ నిధి సొమ్ము అవకతవకలపై విచారణ జరిపించాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీ బోస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని మాలపాడు, వెల్ల గ్రామాల్లో స్త్రీనిధి సొమ్మును యానిమేటర్లు బ్యాంకులకు చెల్లించకుండా కాజేసినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఆయా గ్రామ సచివాలయాల్లో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల సమక్షంలో సమావేశం నిర్వహించి విచారణ జరిపించాలన్నారు. కూలిపని చేసుకుంటూ అప్పులు కడుతుంటే వాటిని దోచుకోవడం సిగ్గుగా లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సమైక్య, మండల సమైక్య నిధులు ఎంత ఖర్చు చేశారో వివరాలు అందించాలని ఏపీఎంను ఆదేశించారు. గ్యాస్ సిలిండర్ ఇంటికి డెలివరి ఇచ్చినందుకు రూ.70 వసూలు చేస్తున్నట్లు ఎంపీపీ భవాని సభ దృష్టికి తీసుకురాగా 'దీనికి నేనూ బాధితుడనే' అని తహసీల్దార్ వాపోవడం విశేషం. తరువాత జరిగే మండల సమావేశానికి డీఆర్వోను ఆహ్వానించి సమస్యను ఆయన దృష్టికి తీసుకవెళ్దామని బోస్ చెప్పారు. సొంత ఇళ్లు నిర్మించుకుంటున్న పేదలకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడం వల్ల రుణాలు అందడం లేదని ప్రభుత్వం నుంచి సహాయం రాకపోవడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారం సభ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేసి గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు మండలాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని బోస్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సెలత్‌రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బోస్

అక్కచెల్లెమ్మలకు వడ్డీ సొమ్ము జమ

- నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల రుణాలపై మహిళలకు తగ్గిన భారం
- జిల్లాలో 6,796 మంది లబ్ధిదారులకు రూ.89,24,081 చెల్లింపు



మహిళలకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకంలో లబ్ధిదారులైన స్వయం సహాయక సంఘాలలోని మహిళలపై భారం తగ్గించడానికి వారు తీసుకున్న రూ.35 వేలు రుణాలపై వడ్డీ చెల్లిస్తున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం వడ్డీ రీయింబర్స్‌మెంట్ మొదటి దశ నిధులను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో జమ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన ఇళ్లను ఒక వరంగా భావించాలన్నారు. పేద అక్కాచెల్లెళ్లకు అండగా నిలిచి వారి సొంతింటి కలను సాకారం చేయడానికి వడ్డీని చెల్లిస్తున్నట్టు చెప్పారు. పేదల సొంతింటి కల సాకారం కావాలన్న తపనతో స్థలాలు ఉచితంగా అందించడమే కాకుండా రూ.15వేల విలువగల ఇసుకను ఉచితంగా అందించడంతో పాటు రూ.15 వేల విలువైన ఇతరత్రా నిర్మాణ సామగ్రి తక్కువ ధరకే అందించినట్టు చెప్పారు. పేదలకు శాశ్వత చిరునామా కల్పించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. కోనసీమ జిల్లాలో మొదటి దశలో రూ.35 వేలు రుణం పొందిన 6,796 మంది లబ్ధిదారులకు వడ్డీ సొమ్ము రూ.89,24,081 నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పథక సంచాలకులు వి.శివశంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల పథకం కింద మొదటి దశలో గృహాల నిర్మాణానికి అదనపు మొత్తంగా రూ.35 వేలు స్వయం సహాయక రుణాన్ని పొందాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలో 15 మండలాలు, నాలుగు అర్బన్ మండలాలు వడ్డీ రీయింబర్స్‌మెంట్‌కు అర్హత పొందాయన్నారు. వాటిలో అల్లవరం మండలం లో 151 మంది, అమలాపురంలో 377, అమలాపురం అర్బన్‌లో 155, ఉప్పలగుప్తం మండలంలో 51, ఆలమూరులో 208, ఆత్రేయపురంలో 152, రావులపాలెంలో 285, కపిలేశ్వరపురంలో 512, మండపేటలో 957, మండపేట అర్బన్‌లో 559, రాయవరంలో 884, ఐ.పోలవరంలో 227, ముమ్మిడివరంలో 170, ముమ్మిడివరం అర్బన్‌లో 56, కె.గంగవరం 482, రామచంద్రపురం 852, రామచంద్రపురం అర్బన్ 297, మామిడికుదురు 78, రాజోలు మండలంలో 343 మంది మొత్తం 6,796 మంది లబ్ధిదార మహిళలు మొదటి విడత వడ్డీ రీయింబర్స్‌మెంట్‌కు అర్హత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు శ్రీనివాసరావు, డీపీఎం విజయ్‌కుమార్, లబ్ధిదార మహిళలు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి తొమ్మిది మెట్లు

- పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- జిల్లా స్థాయిలో గుర్తించిన మండల రీసోర్స్ పర్సన్లకు శిక్షణ పూర్తి
- జిల్లాలో 385 పంచాయతీల్లో జీపీడీపీ రూపకల్పన
- జీపీడీపీ ఆమోదానికి ఈ నెల 29 తుది గడువు



జీపీడీపీపై మండల స్థాయి రీసోర్స్ పర్సన్లకు ఇస్తున్న శిక్షణ

రాయవరం: గ్రామాల సర్వతోముఖాభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నది కాదనలేని సత్యం. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాల్సి ఉంది. వికేంద్రీకరణలో భాగంగా పంచాయతీల్లో క్షేత్ర స్థాయి అవసరాలు ప్రాతిపదికగా చేసుకుని గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా షెడ్యూల్‌ను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు విడుదలయ్యే నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు, పంచాయతీ ఆర్థిక వనరుల ద్వారా సమకూరే నిధులతో తొమ్మిది అంశాల ప్రామాణికంగా ప్రణాళికను రూపొందించాల్సి ఉంది. పంచాయతీ స్థాయిలో ముసాయిదా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (డ్రాఫ్ట్ జీపీడీపీ) తయారు చేసే ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ ఏ విధంగా చేపట్టాలి, ప్రణాళిక రూపకల్పనలో పంచాయతీలు ఏ ఏ నిబంధనలు అనుసరించాలనే విషయాలపై ఇప్పటికే మార్గదర్శకాలు విడుదలయ్యాయి. గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్(జీపీడీపీ) రూపకల్పనపై జిల్లా స్థాయిలో మండల స్థాయి అధికారులకు శిక్షణ పూర్తి చేశారు.

జిల్లా స్థాయిలో..

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు కోసం మంగళ, బుధవారాల్లో మండల స్థాయి అధికారులకు రెండు రోజుల ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఎంపీడీవో, పంచాయతీ విస్తరణాధికారి(ఈవోపీఆర్‌అండ్‌ఆర్‌డీ), ప్రతి మండలం నుంచి ఒక పంచాయతీ కార్యదర్శి, పంచాయతీరాజ్ శాఖ ఏఈ, గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ, ఒక డిజిటల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లకు జీపీడీపీపై అవగాహన కల్పించారు. జిల్లా స్థాయిలో ఈ విధంగా 154 మంది జిల్లా వ్యాప్తంగా శిక్షణ పొందారు. వీరంతా ఈ నెల 17,18 తేదీల్లో మండల స్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫ్రంట్‌లైన్ వర్కర్స్, ఫంక్షనల్ కమిటీలకు శిక్షణనిస్తారు. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు పంచాయతీ స్థాయిలో ముసాయిదా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసేందుకు షెడ్యూల్ ప్రకటించారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీలోగా జీపీడీపీ(2024-25) ఆమోదానికి అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభ నిర్వహణ చేపట్టాలి. 27 నుంచి 28వ తేదీ వరకు గ్రామ స్థాయిలో ఆమోదించిన గ్రామ స్థాయి అభివృద్ధి ప్రణాళికలను మండల స్థాయి కమిటీ స్క్రూటినీ చేస్తుంది. 28, 29 తేదీల్లో గ్రామ పంచాయతీ తీర్మానం ఆమోదం, ఇలా ఆమోదించిన ప్రణాళికలు(జీపీడీపీ), ఈ-గ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో ఈ నెల 31లోగా ఇప్పటికే జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఫిబ్రవరి 1 నుంచి 29వ తేదీలోగా మండల స్థాయిలో బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్(బీపీడీపీ) తయారు చేయాల్సి ఉంది. అలాగే జిల్లా పంచాయతీ డవలప్‌మెంట్ ప్రణాళికను కూడా ఆమోదించాల్సి ఉంటుంది. ఈ ప్రణాళికలన్నీ ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

జిల్లా స్థాయిలో శిక్షణ పూర్తి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలి. పంచాయతీల సమగ్ర అభివృద్ధిపై అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్స్ అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధికి ప్రామాణికాలుగా గుర్తించిన తొమ్మిది అంశాలతో పాటు ఆర్థిక వ్యవహారాలు, ఆదాయ వనరులు తదితర అంశాలపై అవగాహన కల్పించేలా ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించాం.

– వంగా కృష్ణకుమారి, జిల్లా పంచాయతీ అధికారి, అమలాపురం

తొమ్మిది అంశాలే ప్రాతిపదికగా..

గ్రామ పంచాయతీల అభివృద్ధికి తొమ్మిది అంశాలను ప్రాతిపదికగా తీసుకోవాల్సి ఉంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు నవరత్నాల వంటి తొమ్మిది అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు.

1.పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన ఉండడం.
2. ఆరోగ్యవంతమైనది.
3. బాలలకు స్నేహపూర్వకమైనది
4. నీటి సమృద్ధి కలిగినది.
5. పరిశుభ్రం, పచ్చదనం కలిగినది.
6. స్వయం సమృద్ధితో కూడిన మౌలిక సదుపాయాలు కలిగినది.
7. సామాజిక న్యాయం, సామాజిక భద్రత కలిగినది,
8. సుపరిపాలనతో కూడినది
9. మహిళలకు స్నేహ పూర్వకమైనది.

ఈ తొమ్మిది అంశాలే ప్రాతిపదికగా జిల్లాలో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవాలి. ఈ తొమ్మిది అంశాల్లో ఏదో ఒక అంశాన్ని ప్రతీ గ్రామ పంచాయతీ తప్పనిసరిగా ఎంచుకుని, ఆ మేరకు గ్రామాభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలి. ప్రతి పంచాయతీ కనిష్టంగా ఒకటి, గరిష్టంగా రెండు అంశాలను ఎంచుకుని గ్రామాభివృద్ధి ప్రణాళికను తయారు చేసుకోవచ్చు. 2030లోగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా ప్రతీ ఏటా ఒక థీమ్‌ను ఎంచుకుని ప్రణాళిక ప్రకారం గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నది దీని ముఖ్య ఉద్దేశం.

పూర్తి స్థాయి పారదర్శకంగా..



అవినీతికి ఆస్కారం లేని విధంగా పూర్తి స్థాయి పారదర్శకంగా ప్రణాళికలు రూపొందించే విధంగా సిస్టమ్‌ను రూపొందించారు. గతేడాది నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అనుగుణంగా గ్రామ స్థాయి అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లా స్థాయిలో మండల స్థాయి రీసోర్స్ పర్సన్‌కు శిక్షణ ఇచ్చాం.


– గరగ రామకృష్ణ, స్టేట్ రీసోర్స్ పర్సన్, సోమేశ్వరం, రాయవరం మండలం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గండేపల్లి: కారును మోటార్ సైకిల్ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం మేరకు భద్రాచలం సమీపంలో గల వేలేరుపాడు మండలం వేలేరుపాడుకు చెందిన మాతబత్తుల సత్తిబాబు కుటుంబ సమేతంగా సంక్రాంతికి రాజమహేంద్రవరం అత్తవారి ఇంటికి వచ్చి గురువారం కాకినాడ బీచ్‌కు వెళుతుండగా మండలంలోని రామేశంపేట సమీపంలోకి వచ్చేసరికి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న మోటార్ సైకిల్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ఉన్న ముగ్గురిలో యువతి, యువకునికి గాయాలుకాగా కారుకు కుడివైపు ముందు భాగం దెబ్బతింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

అప్పులు, అనారోగ్యంతో ఆత్మహత్య


మృతుడు రామకృష్ణ(ఫైల్)

రావులపాలెం: చేసిన అప్పులు ఒకపక్క, అనారోగ్యంతో మరోపక్క బాధపడుతున్న ఒక వృద్ధుడు పురుగుమందు తాగి మృతి చెందిన ఘటనపై ఏఎస్సై శ్రీనివాస్ గురువారం కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొమరాజులంకకు చెందిన పింద్ర రామకృష్ణ(76) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈయనకు వివాహం అయిన ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇటీవల కాలంలో అప్పుల బాధకు అనారోగ్యం తోడైంది. మనస్తాపం చెందిన రామకృష్ణ ఈ నెల 17వ తేదీన పురుగు మందు తాగడంతో స్థానికులు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందడంపై కుమారుడు లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

గడియారం టైమ్ బాగో లేదు

- సెల్‌ఫోన్ల రాకతో మారిన పరిస్థితులు
- ఉపాధి కోల్పోతున్న మెకానిక్‌లు
- ప్రస్తుతం మార్కెట్‌లో వాడి పడేసేవే ఎక్కువ






గడియారం బాగు చేస్తున్న మెకానిక్ అశ్రాఫ్ హుస్సేన్

రాయవరం: సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కే కొద్దీ మార్కెట్‌లో పాత వాటికి గిరాకీ తగ్గుతోంది. దీంతో వాటిపై ఆధారపడ్డ వారు ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. దీనికి ఉదాహరణగా గడియారాలను చెప్పుకోవచ్చు. గతంలో వాచీల రిపేరు చేసేవారు వీధికి ఒకరు దర్శనమిచ్చేవారు. అప్పట్లో వాచ్‌షాపులు ఎక్కువగా ఉండేవి. వాచ్ రిపేర్ వర్క్ నేర్చుకోవడానికి సైతం యువకులు ఉత్సాహం చూపించేవారు. ఇది 2002కు ముందు వరకు ఉన్న పరిస్థితి. ఆ తర్వాత ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అప్పటికే సెల్‌ఫోన్లు ప్రతి ఒక్కరి చేతిలోకి వచ్చాయి. సెల్‌ఫోన్‌లో టైం చూసుకోవడంతో ప్రతి ఒక్కరికి చేతి వాచ్‌ల మీద ఆసక్తి పోయింది.

గతంలో గడియారాల వాడకం ఎక్కువే

గడియారాల వాడకం 17ఏళ్ల క్రితం ఎక్కువగా ఉండేది. మొదట్లో ఎక్కువగా గడియారాలకు గిరాకీ ఉండేవి. వీటికి ప్రతి 24గంటలకు ఒకసారి కీ ఇచ్చుకోవాల్సి వచ్చేది. గోడ గడియారానికి సైతం వారానికొకసారి కీ ఇస్తే సరిపోయేది. ఇవి దశాబ్దాలు పనిచేశాయి. ఇప్పటి ఎలక్ట్రానిక్ గడియారాలు ఐదేళ్లకు మించి పనిచేసే పరిస్థితి లేదు.

యూజ్ అండ్ త్రో వాచ్‌లు

ప్రస్తుతం వస్తున్న ఎలక్ట్రానిక్ గడియారాలు ఐదేళ్ల కంటే ఎక్కువ కాలం పనిచేయడం లేదు. ఇవి ఎక్కువ రిపేర్లకు కూడా సహకరించవు. గతంలో రిపేర్ల విషయానికొచ్చేసరికి అప్పటి వాచ్‌లు ఎక్కువగా ఓవర్ ఆయిల్ చేస్తే సరిపోయేది. అంతేకాక కీ రాడ్‌లు, వాచ్‌పై గ్లాస్, ముల్లులు ఎక్కువగా రిపేర్‌కు వస్తుండేవి. ఇప్పటి ఎలక్ట్రానిక్ వాచ్‌లకు బ్యాటరీలు మార్చుకుంటే సరిపోతోంది. ఇప్పటి వాచ్‌లు యూజ్ అండ్ త్రో లెక్కనే పనిచేస్తున్నాయి. దీనివల్ల వాచ్ రిపేర్లు చేసేవారికి చేతినిండా పనిలేకుండా పోతోంది. దీంతోవారు జీవనోపాధి కోల్పోతున్నారు. అందుకే ఆ రంగంపై వెళ్లేవారు తక్కువగా ఉన్నారు. అడపాదడపా అన్నట్లుగా ఉన్న వారికి కూడా వాచ్‌ల సర్వీసింగ్ దొరకడం కష్టంగా మారింది. ప్రస్తుతం ఇప్పుడు వాచ్‌లు బాగు చేసేవారు పట్టణాల్లో షాపుల ముందు చిన్న చెక్కబల్ల పెట్టుకుని పనిచేస్తున్నారు. అతి చిన్నవిగా ఉంటే వాచ్ భాగాలను బిగించడానికి వారు కళ్లకు ఏర్పాటు చేసిన భూతద్దం ప్రభావం కంటి చూపుపై పడుతోంది.

సర్వం సెల్‌ఫోన్ మయం

ఒకప్పుడు విద్యార్థులు..రైతులు..ఇలా అన్ని వర్గాల వారు ఉదయాన్నే లేవడానికి గడియారంలో అలారం పెట్టుకుని నిద్రలేచేవారు. ఇప్పుడు మొత్తం పరిస్థితి మారింది. సెల్‌ఫోన్ సర్వం అన్నట్లుగా ఉంది. సాధారణ ఫోన్లతో పాటు ఆండ్రాయిడ్ ఫోన్లలో అన్ని రకాల సౌకర్యాలు ఉంటున్నాయి. సెల్‌ఫోన్‌లో తేదీ, సమయంతో పాటు అలారం సౌకర్యం కూడా ఇస్తున్నారు. దీనివల్ల గడియారాల అవసరమే లేకుండా పోతోంది.

దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నాం



మా తాత, తండ్రుల నాటి నుంచి ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాం. అలవాటైన వృత్తి కాబట్టే వదల లేక పోతున్నాం. ప్రస్తుతం సెల్‌ఫోన్ యుగం నడుస్తోంది. గడియారాలకు ఆదరణ తగ్గింది.

– మహమ్మద్ రఫీ, గడియారాల మెకానిక్, రామచంద్రపురం

సెల్‌ఫోన్‌లోనే అన్నీ ఉంటున్నాయి



ఇప్పుడు అంతా సెల్‌ఫోన్ యుగంగా మారింది. సెల్‌ఫోన్‌లోనే సమస్తం ఉన్నాయి. సెల్‌ఫోన్‌లో గడియారం, అలారం, ఎంత నడక నడిచాం లాంటి అన్ని విషయాలు చూసుకుంటున్నారు. ముఖ్యంగా నేటి యువత సెల్‌ఫోన్ పైనే ఆధారపడుతున్నారు.

– మహ్మద్ రౌఫ్

గోదావరి కాలువలో గుర్తుతెలియని మృతదేహం

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని గురువారం పోలీసులు గుర్తించారు. సామర్లకోట కెనాల్ రోడ్డులో వేట్లపాలెం–జి. మేడపాడు మధ్య గోదావరి కాలువలో మృతదేహం ఉన్న విషయాన్ని వేట్లపాలెం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో ఎస్సై మౌనిక ఘటనా ప్రదేశానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహం పూర్తిగా పాడై, ఎటువంటి ఆధారాలు లభించక పోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసును నమోదు చేశారు. మృతుడు నలుపు, తెలుపు చారలు కలిగిన ఫుల్ హ్యాండ్స్ షర్టు, నీలం రంగు ప్యాంటు ధరించినట్టు, 30–35 సంవత్సరాల వయస్సు ఉంటుందని ఎస్సై మౌనిక తెలిపారు. మృతుని వివరాల కోసం 94920 49449కు సంప్రదించాలన్నారు.

అరటితోట ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుపల్లి గ్రామంలో అన్నా చెల్లి మధ్య వివాదం నేపథ్యంలో అరటితోట ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ గురువారం తెలిపారు. ఈ నెల 17వ తేదీ రాత్రి కోరుపల్లిలో మానే సుభశ్రీకి చెందిన అర ఎకరం అరటితోటని బుల్లిరాజు ధ్వంసం చేశాడన్నారు. తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి చెట్లు నరికేసి అన్న బుల్లిరాజు ఆస్తినష్టం కలిగించినట్లు బాధితురాలు సుభశ్రీ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏఐపై దృష్టి సారించాలి


వర్క్‌షాపులో మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నేటి యువత, అధ్యాపకులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై దృష్టి సారించాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో గురువారం ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ రీఫార్మ్స్, ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూరియల్ డెవలప్‌మెంట్ అంశంపై ఓడీఎల్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీకృష్ణ అధ్యక్షతన వర్క్‌షాపు నిర్వహించారు. వీసీ ప్రసాదరాజు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే సాఫ్ట్‌వేర్ రూపొందించాలన్నారు. మానవునికి భవిష్యత్తులో సంభవించే ఆరోగ్య పరమైన సమస్యలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా వైద్యులు గుర్తిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యపై దృష్టి కేంద్రీకరించి వినూత్న కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవస్తోందన్నారు. వ్యవస్థాపకులుగా, వినూత్న ఆవిష్కరణలు చేపట్టే సమయంలో ఎదురయ్యే సవాళ్లను నిబద్ధతతో ఎదుర్కొని విజయం సాధించాలన్నారు. జేవీఆర్ ఇనిస్టిట్యూట్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ ఎస్‌ఎంకె భట్టా మాట్లాడుతూ విద్యార్థి దశలో లభించే అవకాశాల గురించి యువతకు చాలా మందికి తెలీయదని, అవకాశాలు అందిపుచ్చుకుంటే విజయం దానంతట అదే వస్తుందన్నారు. హైదరాబాద్ నార్సీ మోంజీ ఇనిస్టిట్యూట్ అడ్మిషన్స్ విభాగాధిపతి పాండురంగారావు మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించి వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలు చేపట్టేందుకు ఆసక్తి కనబరచాలన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండల విద్యార్థులకు విద్యతో పాటు వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దడానికి ఇంటర్న్‌షిప్స్, ప్లేస్‌మెంట్స్ వంటివి కల్పించి సంరక్షునిగా వ్యవహారించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుమలత, డైరెక్టర్ వెంకటరెడ్డి, సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● రావి రామప్రభో!



కృష్ణ స్వామి

అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠాపన వేళ తన భక్తిని చాటుకుంటూ ఓ యువ ప్రొఫెసర్ రావి ఆకుపై గీసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో 2023లో బీటెక్ పూర్తిచేసి అదే కళాశాలలో సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ద్రాక్షారామానికి చెందిన పెంకే కృష్ణస్వామి రావి ఆకుపై రాముని చిత్రం గీశాడు. రావి ఆకులో ఉన్న పచ్చదనాన్ని తొలగించి ఆ ప్రదేశంలో స్కెచ్ పెన్‌తో జై శ్రీరాం అనే వాక్యం, రాముని ముఖచిత్రం, పేపర్‌పై సీతారామ, ఆంజనేయులు వంటి చిత్రాలు గీశారు. వీటిని గీసేందుకు రెండు గంటల సమయం పట్టిందని తెలిపారు. ఈ చిత్రాన్ని శ్రీరామునికే అంకితం ఇస్తున్నట్టు తెలిపారు.

– గండేపల్లి

ఆరుద్ర ఆరోపణలకు డీఎస్పీ ఖండన



విలేకరులతో మాట్లాడుతున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: అమలాపురం పట్టణ గొల్లగూడెం, ప్రస్తుతం కాకినాడ రాయుడుపాలెం సిద్దార్ధ నగర్‌కు చెందిన రాజులపూడి ఆరుద్ర తరచూ తన ఇంటిని అమ్ముకోకుండా పోలీసులు అడ్డుపడుతున్నారని చేస్తున్న ఆరోపణలను పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ఖండించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆరుద్ర అనే ఆమెకు కాకినాడ జిల్లా అన్నవరంలో ఇల్లు ఉంది. ఈ ఇల్లు అమ్ముకునే క్రమంలో అడ్డుపడుతున్నారని పోలీసు శాఖలో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న మెరపల వీర వెంకట సత్యనారాయణ అనే శివ, అతని సోదరుడు మెరపల నాగకన్నయ్య, ముత్యాలరావు, న్యాయవాది చిట్టిబాబులపై అన్నవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఆ కేసు దర్యాప్తులో ఉండగా నిందితులు ఎఫ్ఐఆర్ రద్దు చేయాల్సిందిగా హైకోర్టును ఆశ్రయించారన్నారు. ఆ కేసుకు కౌంటర్‌గా రాజులపూడి ఆరుద్రపై పెట్టిన కేసు దర్యాప్తు చేసి, ఆమెపై వచ్చిన ఆరోపణలు అవాస్తమని కేసు రిఫర్ చేశామన్నారు. ఇద్దరు కానిస్టేబుళ్లపై క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకున్నామన్నారు. ఆరుద్ర చేసిన ఆరోపణల నేపథ్యంలో ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారులను నియమించామన్నారు. దర్యాప్తు తుది దశలో ఉందని, విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపించి, వారి ఆదేశాల మేరకు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కె.లతాకుమారి తెలిపారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు



హత్యకేసు వివరాలను వివరిస్తున్న సీఐ శ్రీనివాస్

పిఠాపురం: విరవాడలో ఒక ఇటుకల బట్టీ వద్ద జరిగిన హత్య కేసులో నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన విరవాడలో ఉన్న తప్పెట రాంబాబుకు చెందిన ఇటుకల బట్టీలో పనిచేస్తున్న మృతుడు సిద్ధాంతపు అప్పారావును అతని భార్య చిన్నారి, గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన నురుకుర్తి సురేష్ హత్య చేసినట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలిందన్నారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని తెలిపారు. మృతుడి అక్క దాకే మరియమ్మ ఇచ్చిన ఫిరాదుపై ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు నాలుగు బృందాలు నిందితుల కోసం గాలించాయన్నారు. వీరిని గురువారం చెందుర్తి జంక్షన్ వద్ద కనకదుర్గాదేవి ఆలయం సమీపంలో అరెస్టు చేసి, హత్యకు వాడిన కత్తిని, రక్తపు మరకలు గల దుస్తులను, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై గుణశేఖర్ పాల్గొన్నారు.

పెద్ద మొత్తంలో నగదు తీసుకెళితే ఆధారాలు చూపాలి


వ్యాపారులతో మాట్లాడుతున్న సీటీవో సుబ్బారావు

వ్యాపారులకు సీటీవో సుబ్బారావు సూచన

అమలాపురం టౌన్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నగదు, పెద్దమొత్తంలో వస్తువుల రవాణాపై వాణిజ్య పన్నుల శాఖ నుంచి నిఘా అధికంగా ఉంటుందని అమలాపురం సీటీవో టి.సుబ్బారావు స్పష్టం చేశారు. స్థానిక సీటీవో కార్యాలయంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులతో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో సీటీవో సుబ్బారావు మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో వ్యాపారులు నగదును పెద్ద మొత్తంలో తరలిస్తున్నప్పుడు తగిన ఆధారాలు చూపాలని సూచించారు. బంగారు, వెండి వస్తువులు, ఏదైనా వస్తువులను బల్క్‌గా తరిలిస్తున్నప్పుడు కూడా తగిన బిల్లులతో కూడిన ఆధారాలు సమర్పించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యాపారులు బల్క్ ఆర్డర్స్ ఇస్తున్నప్పుడు అప్రమత్తంగా ఆలోచించి ఇవ్వాలని సూచించారు. రూ.50 వేల పైబడి ఉంటే ఆధారాలు చూపకుంటే ఆ వస్తువులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. డిజిటల్ లావాదేవీల పేమెంట్స్ వరకూ ఫరవాలేదని సీటీవో వర్తకులకు వివరించారు. ది అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు దొమ్మేటి సాయిబాబు, చింతలపూడి సత్తిబాబు, మోకా వెంకట సుబ్బారావు తమకున్న సందేహాలను అధికారుల ముందు ఉంచి నివృత్తి చేసుకున్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

యానాం: నియోజకవర్గ శివారు దరియాలతిప్ప గ్రామానికి అక్రమంగా మద్యం తరలిస్తున్న మల్లాడి గంగాధర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 28 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. దరియాలతిప్ప అవుట్‌పోస్ట్ ఎస్ఐ కట్టా సుబ్బరాజు నేతృత్వంలోని బృందం గురువారం స్థానిక పెట్రోల్ బంకు వద్ద గంగాధర్‌ను అరెస్ట్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఎక్సైజ్ డిప్యూటీ తహసీల్దార్ దండయపాణి వద్ద హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగు తరాల ఆత్మీయ సమ్మేళనం

నిడదవోలు : పట్టణంలో కేదారిశెట్టి వెంకటేశ్వరరావు కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారు గురువారం కేదారిశెట్టి రవికుమార్ నివాసంలో ఆత్మీయ సమ్మేళనం పేరిటి కలిశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాలుగు తరాల కుటుంబ సభ్యులు ఆట, పాటలతో సందడి చేశారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు చిన్ననాటి జ్ఞాపకాలను తలచుకుంటూ సంతోషంగా గడిపారు. కుటుంబ సభ్యులు కేదారిశెట్టి బేబి పద్మావతి, విజయ్ కృష్ణ, త్రిపుర, శ్రీహరికుమార్, దుర్గ, సతీష్ కుమార్, హారిక, ప్రసాద్, కాశీ విశ్వనాథం, కల్కి, దీపు, అమరావతి, శ్రీరామచంద్ర ప్రసాద్, నెహ్రూ పలుకూరి కాళీదాస్, జానకి, జగన్, ప్రభ, మద్దుల శ్రీదేవి, మణికంఠ, చందు, మడిపల్లి శ్రీనివాస్, ప్రభ, శరణ్య పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న కుటుంబ సభ్యులు

కారు–ఆటో ఢీ : ఐదుగురికి గాయాలు


ఆటోను ఢీకొన్న కారు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం కాకినాడ నుంచి సామర్లకోట వస్తున్న ఆటోను సామర్లకోట నుంచి కాకినాడ వెళుతున్న కారు కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయ సమీపంలో ఢీ కొంది. దాంతో ఆటో డ్రైవరుతో పాటు మరో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవరు సత్యనారాయణ, ప్రయాణికులు అఖిల్, నీలిమ, విజయ్, మురళి గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సామర్లకోటలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన ఎస్సై మౌనిక దర్యాప్తు చేస్తున్నారు.